ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 349 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 29 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ జరుపుతాం

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా నిజాలు నిగ్గుతేల్చి నివేదిక ప్రవేశపెడతాం
- శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్, హరీశ్ సోదరుడి మైనింగ్.. అన్నింటిపై విచారణ చేపడతాం
- ఒక్కొక్కరి సంగతి తేలుస్తాం.. మైనింగ్ తప్పిదాల్లో ఎవరినీ ఉపేక్షించం
- గతంలో హరీశ్, కేటీఆర్ రూ. వేల కోట్ల ఇసుక మాఫియా నడిపారు
- ఆదాయ పంపకాల్లో తేడాలతోనే కవితను కేటీఆర్ బయటకు గెంటారు
- ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా గట్టి చర్యలు తీసుకున్నాం
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసు ఇచ్చి రూ. కోటిన్నరపైనే వసూలు చేశాం



**హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో అక్రమ మైనింగ్ విషయంలో విపక్ష బీఆర్ఎస్ బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతోందని.. అయినప్పటికీ తమ ప్రభుత్వం ఏమాత్రం భయపడబోదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన 2014 జూన్ 2 నుంచి నేటి వరకు ఇచ్చిన మైనింగ్ లీజులు, అక్రమాలపై పూర్తిస్థాయి సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభ వేదికగా సీఎం ప్రకటించారు. ప్రధానంగా అక్రమ మైనింగ్ ఆరోపణలు వచ్చిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్, హరీశ్ సోదరుడి మైనింగ్ సంస్థ సహా ఆరు సంస్థలపైనా సమగ్ర దర్యాప్తు ఉంటుందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోగా ఈ విచారణ ముగించి నిజాలను నిగ్గుతేల్చి సభ ముందు నివేదికను ఉంచి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటికి చెందినదని.. ఆ సంస్థ మైనింగ్ అక్రమాలపై సభాసంఘాన్ని వేయడంతోపాటు విచారణ సజావుగా సాగేలా సంబంధిత మంత్రి రాజీనామా చేయాలంటూ సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. సభ వెల్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో పాటు అక్కడే బైఠాయించి నినాదాలతో హోరెత్తించారు. ఈ

..మిగతా 2లో



### పశ్చిమాసియా ఉద్రిక్తతలను
# భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోంది: మోదీ

**నోయిడా ఫేజ్-1 విమానాశ్రయాన్ని ప్రారంభించిన మోదీ**

**యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని హామీ**

**న్యూఢిల్లీ, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచం ఆందోళన చెందుతున్న తరుణంలో, భారత్ మాత్రం ఆ సంక్షోభాన్ని పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ తెలిపారు. నిత్యావసరాల కొరత వల్ల ప్రపంచమంతా ఆందోళన చెందుతున్నా, ఆ భారం సామాన్య కుటుంబాలతోపాటు రైతులపై పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ మేరకు నోయిడా ఫేజ్-1 విమానాశ్రయాన్ని శనివారం ప్రారంభించిన మోదీ, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు.

**డబుల్- ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యం!**

"సమాజ్‌వాదీ పార్టీ నోయిడాను దోపిడీకి ఏటీఎంలా మార్చింది, కానీ నేడు బీజేపీ ప్రభుత్వ హయాంలో యూపీ అభివృద్ధికి చోదక శక్తిగా మారుతోంది. డబుల్-ఇంజిన్ విధానం ద్వారా ఇది సాధ్యమైంది" అని అన్నారు. 2004 నుంచి 2014 వరకు నిలిచిపోయిన విమానాశ్రయ ప్రాజెక్టును ఆలస్యం చేసినందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను ఆయన విమర్శిస్తూనే, చివరకు దానికి శంకుస్థాపన చేసి, కార్యరూపం దాల్చినందుకు బీజేపీ -ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశంసించారు.

"గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని

..మిగతా 2లో

### చిన్నారులకు
# తొలిముద్ద

**పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**

**అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ**

**అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత**




**హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ

..మిగతా 2లో

### మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై
# హరీశ్ రావు ఆరోపణలు



**హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అసెంబ్లీ సాక్షిగా ధ్వజమెత్తారు. సర్వే నంబర్ 62, 63లలో జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని ఆయన ఆరోపించారు. మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చినా, లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును ప్రస్తావిస్తూ హరీశ్ రావు ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. చిన్న తప్పు చేశారనే నెపంతో మహిపాల్ రెడ్డి తమ్ముడిని రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారని, మరి అంతకంటే పెద్ద అక్రమాలకు పాల్పడుతున్న మంత్రి సంస్థపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. "అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?" అని మండిపడ్డారు. తన ట్వీట్లపై మంత్రి పొంగులేటి 'మొరిగే కుక్కలు' అంటూ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అక్కడ

..మిగతా 2లో

### ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను
# ప్రారంభించిన సిఎం



**హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం

..మిగతా 2లో



# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

**అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం**

**తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్**

**హైదరాబాద్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన

..మిగతా 2లో

# పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



విద్యార్థులు రాస్తున్న పరీక్షను పరిశీలిస్తున్న అదన కలెక్టర్ లక్ష్మీనారాయణ



పరీక్ష పత్రాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, చిత్రంలో ఉపాధ్యాయుడు భరత్ కుమార్

## అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల జిల్లా ప్రతినిధి మార్చి 28(ప్రభాత ఉదయం)**

పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం గద్వాలలోని విశ్వేశ్వరయ్య, విశ్వభారతి పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం జవాబు పత్రాలను స్థానిక తపాలా కార్యాలయంలో డిపాజిట్ చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని కొన్ని తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ పరీక్షల అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ జరుపుతాం

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఈ కీలక ప్రకటన చేశారు. ఇసుక లేదా లీజు మాఫియాలో గతంలో ఫైన్లు, పెనాల్టీలు వేసి వాటిని తగ్గించి సంబంధిత వ్యక్తులను పార్టీలో చేర్చుకొని మళ్లీ ఆ చార్జీలను తొలగించాలని చేసిన ప్రయత్నాలన్నింటినీ ఈ విచారణ ద్వారా తేల్చి ఒక్కొక్కరి సంగతి తేలుస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ ఆదాయానికి గండిపడినా, ఖనిజ లేదా ఇతర ఆదాయానికి గండిపడేలా ఎలాంటి తప్పిదాలు జరిగినా ఎవరినీ ఉపేక్షించబోమని తేల్చిచెప్పారు.

**నాడు బెదిరించి.. లీజులు రాయించుకొని**

'సిరిసిల్ల నియోజకవర్గం నేరెళ్లలో దళితులను ఇసుక లారీతో ఢీకొట్టించి చంపి సంతోశ్‌రావు తండ్రి రవీందర్‌రావుకు సంబంధించిన నేరెళ్ల ఇసుక మాఫియా అక్రమ ఇసుక రవాణా చేసింది. శిరీష గ్రానైట్స్ జియో గ్రానైట్స్ ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేవి. గతంలో మైనింగ్ శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆయన్ను బెదిరించి వారి మైనింగ్ లీజును రాయించుకున్నారు. మిడ్‌వెస్ట్ గ్రానైట్స్‌కు సంబంధించి ఇప్పుడు రెవెన్యూ మంత్రిని బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోదరుడు మహేశ్‌రావు అక్రమ మైనింగ్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు చెందిన శ్వేత గ్రానైట్స్ అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణే కాకుండా ఈడీ విచారణ కూడా జరుగుతోంది. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు చెందిన గాయత్రి గ్రానైట్స్‌పై గతంలో ఫైన్లు, పెనాల్టీలు వేసి లొంగదీసుకొని మళ్లీ ఆర్బిట్రేషన్‌లో తగ్గించి గాయత్రి గ్రానైట్స్ రాయించుకొని అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు'అని సీఎం రేవంత్ ఆరోపించారు. వాటన్నింటిపైనా విచారణ జరిపిస్తామన్నారు.

**ఇసుక ఆదాయం పెంచాం..**

'మేం అధికారంలోకి వచ్చాక పెంచిన ఆదాయం కళ్ల ముందు ఉంది. రాష్ట్రానికి ఇసుక ద్వారా ఆదాయం 2020--21లో రూ. 721 కోట్ల ఆదాయం వస్తే 2025--26లో రూ. 972 కోట్లు (35 శాతం) పెంచాం. నిర్మాణ రంగం కుంటుపడిందని, రియల్ ఎస్టేట్ దెబ్బదిన్నదని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దెబ్బతింటే మేం ఇసుకను బుక్కుతున్నామా? బిర్యానీ వండుకొని తింటున్నామా? ఇసుకలోనే ఏడాదికి రూ. వెయ్యి కోట్ల ఆదాయం పెరిగిందంటే అర్థం ఏమిటి?'అని సీఎం రేవంత్ ప్రశ్నించారు.

**బురదజల్లేందుకే బ్లాక్‌మెయిలింగ్..**

'బీఆర్ఎస్ నేతల దోపిడిని నిలువరించి ఇసుక, మైనింగ్‌లో ఆదాయం పెంచితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచిపేరు వచ్చి గత పదేళ్లలో బీఆర్ఎస్ సాగించిన దోపిడి ప్రజలకు అర్థమవుతుందనే సంబంధిత మంత్రిపై బురదచల్లేందుకు, బ్లాక్‌మెయిల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏపీ, తెలంగాణలో ఏ రెడ్డికైనా ఏదో ఒక రూపంలో బంధువులు, దూరపు బంధువులు ఉండటం సహజమే. మంత్రి పొంగులేటి, వారి కుటుంబ సభ్యులు, ఎవరో బంధువుల మధ్య ఏవో గొడవలు ఉంటే వాటితో మంత్రికేం సంబంధం? సొంత చెల్లినే ఇంట్లోంచి వెళ్లగొట్టి దోపిడికి పాల్పడిన మీరు.. మంత్రి బంధువులకు ఏవో వ్యాపారాలు ఉన్నాయని పొంగులేటికి ముడిపెట్టి ఆయన్ను బెదిరించి లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇది దిక్కుమాలిన చర్య. ఇలాంటి ప్రయత్నాలు చేయకండి. ఇటువంటి వాటి వల్ల మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు'అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై గతంలోనే చర్యలు తీసుకున్నాం..**

'రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి గతంలోనే ప్రభుత్వం నోటీసు ఇచ్చి చర్యలు తీసుకోవడంలో భాగంగా సీనరేజీ చార్జీ కింద రూ. 1.52 కోట్లు, పర్మిట్ ఫీజు కింద రూ. 1.22 కోట్లను ప్రభుత్వం, మైనింగ్‌శాఖ కట్టించుకుంది. ఇదేదో బీఆర్ఎస్ వాళ్లు కనిపెట్టి, ఫిర్యాదు చేస్తే తాము తీసుకున్న చర్య కాదు. మా ప్రభుత్వం తరఫున మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆ సంస్థకు నోటీసులిచ్చి చర్యలు తీసుకున్నారు. ఇందులో ప్రతిపక్షం కొత్తగా కనిపెట్టిందేమీ లేదు. 2025 ఆగస్టు 8న ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఫిర్యాదుతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

మొదటి పేజీ తరువాయి...

అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

ఎల్అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.





# రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలి

## జాతీయ లోక్ అదాలత్ లో 3,268 కేసుల పరిష్కారం:న్యాయమూర్తి ఆంజనేయులు

**రాజేంద్రనగర్, మార్చి 28(ప్రభాత ఉదయం)**

పెండింగ్ లో ఉన్న కేసులు రాజీ పడదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలని రాజేంద్రనగర్ మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా అదనపు జడ్జి ఆంజనేయులు తెలియజేసారు. ఈ నెల 23 నుండి 28 వరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ కోర్టు భవనముల సముదాయం లో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 3,268 కేసులను పరిష్కరించారు, వాటిలో రాజీ పడిన కేసులు 174, అడ్మిషన్ కేసులు 435, విద్యుత్ చౌర్యం కేసులు 142, డ్రంకన్ డ్రైవ్ కేసులు 2428 పరిష్కరించారు, ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి రాధిక, అదనపు న్యాయమూర్తులు నీలిమ, నరేష్, రత్నకుమారి, శోభ, వేణుగోపాల్ రెడ్డి, ఏపిపిలు క్రిష్ణ మూర్తి, ప్రవీణ్ నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాసోజు యాదగిరి, కార్యదర్శి బందయ్య, లోక్ అదాలత్ సభ్యులు, పాండురంగా రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సుదర్శన్, వెంకట్ రెడ్డి, వరప్రసాద్, శ్రీనివాసులు, సుజాత, సుధాకర్ రెడ్డి, శ్రీ శైలం, జ్ఞనేశ్వర్ చారి, కోర్టు సిబ్బంది సునీత,సత్యనారాయణ, రవీందర్, వెంకట రంగారెడ్డి, నరేష్ గౌడ్ మరియు న్యాయవాదులు ఇతరులు పాల్గొన్నారు

## ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను

# ప్రారంభించిన సిఎం

మొదటి పేజీ తరువాయి...

సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్‌బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# చిన్నారులకు తొలిముద్ద

మొదటి పేజీ తరువాయి...

చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలను

# భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోంది: మోదీ

మొదటి పేజీ తరువాయి...


ప్రభుత్వం, గత ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయడానికి కూడా అనుమతించలేదు. 2004 నుంచి 2014 వరకు ఇది ఫైళ్లలోనే మరుగునపడిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏ పనీ జరగనివ్వలేదు. కానీ బీజేపీ - ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన జరిగింది, ఇప్పుడు విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నాం. అంతేకాకుండా, దేశంలోని రెండు ప్రధాన సరుకు రవాణా కారిడార్లు దాద్రీలో కలుస్తాయి, దీనివల్ల ఈ ప్రాంతానికి అనుసంధానం మెరుగుపడుతుంది" అని ఆయన అన్నారు.

**మూఢనమ్మకాలు, రాజకీయ భయం కారణంగా!**

"ఈ ప్రాజెక్టులన్నీ ఉత్తర్‌ప్రదేశ్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ప్రకాశవంతమైన ఉదాహరణ. సెమీకండక్టర్ ఫ్యాక్టరీ భారతదేశాన్ని సాంకేతికతలో 'ఆత్మనిర్భర్'గా తీర్చిదిద్దుతోంది. మీరట్ మెట్రో, నమో భారత్ రైలు వేగవంతమైన, స్మార్ట్ కనెక్టివిటీని అందిస్తున్నాయి. ఇక నోయిడా విమానాశ్రయం ఉత్తర భారతదేశం మొత్తాన్ని ప్రపంచానికి అనుసంధానిస్తోంది," అని ప్రధాని మోదీ అన్నారు. మూఢనమ్మకాలు, రాజకీయ భయం కారణంగా ఒకప్పుడు నోయిడా ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని పేర్కొంటూ, ఆ ప్రాంతం ఎదుర్కొన్న గత సవాళ్లను ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు .

**చాలా సంతోషంగా ఉన్నా!**

"నోయిడాలో ఎక్కడ చూసినా ఉత్సాహభరితమైన, శక్తివంతమైన యువత కనిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్ తమ భవిష్యత్తుకు కొత్త అవకాశాలు ఇస్తుందని ఈ యువతకు తెలుసు. ఈ రోజు మనం వికసిత్ యూపీ, వికసిత్ భారత్‌లో ఒక కొత్త అధ్యాయాన్ని





ప్రారంభిస్తున్నాం. దేశంలో అత్యధిక అంతర్జాతీయ విమానాశ్రయాలు కలిగిన రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ ఒకటిగా నిలిచింది. ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేసి, దానిని ప్రారంభించే అవకాశం నాకు లభించినందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకుంటున్నాను. నన్ను ప్రతినిధిగా ఎన్నుకున్న రాష్ట్రం ఇకపై గొప్ప విమానాశ్రయంతోనే గుర్తింపు పొందుతుంది" అని తెలిపారు.

**యువతకు కొత్త అవకాశాలు**

"ప్రారంభోత్సవం జరిగిపోయిందా? లేదు. ఇక్కడ ఉన్న మీరందరూ ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని నేను కోరుకుంటున్నాను. దయచేసి మీ మొబైల్ ఫోన్‌లను బయటకు తీయండి, ఫ్లాష్‌లైట్‌ను ఆన్ చేయండి, మీరే దీనిని ప్రారంభిస్తారు. నోయిడాలోని విమానాశ్రయం ఆగ్రా, మథుర, అలీగఢ్, గాజియాబాద్, మీరట్, ఇటావా, బులంద్‌షహర్, ఫరీదాబాద్ వంటి ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. ఇది పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్‌లోని రైతులకు, చిన్న పరిశ్రమలకు, యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది" అని తెలిపారు.

# ఏప్రిల్ చివరి వారంలో గ్రామ ఉత్సవం పేరుతో గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



సమావేశంలో పాల్గొన్న మహిళా సభ్యులు


### స్త్రీ నిధి 13వ సర్వసభ్య సమావేశంలో మంత్రి దనసరి సీతక్క

**బుద్వేల్, మార్చి 28(ప్రభాత ఉదయం)**

పుట్టిన ఊరు లో అందరు కలుసుకుని, ఆ గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకునేలా ఏప్రిల్ మాసంలో ఒక రోజు గ్రామ ఉత్సవం పేరుతో తెలంగాణ రాష్ట్రంలో ఓ కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫర, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ 13వ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ, మైక్రో ఫైనాన్స్ సంస్థల భారి నుం చి గ్రామాలు, పట్టణాల మహిళలకు విముక్తి కల్పించడానికి 2011లో ఏర్పాటు చేసిన స్త్రీ నిధి సంస్థ నేడు రూ.5,500 కోట్ల రుణ నిల్వతో కొనసాగుతు దేశంలోనే ఆదర్శ ప్రాయంగా నిలిచిందన్నారు. ఆర్థిక, కుటుం బ, గ్రామీణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి స్త్రీ నిధి లో ఉన్న 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో చిన్న పిల్లల వివాహాలను ఆపడానికి, మహిళలు స్వేచ్ఛగా తిరగడానికి, అత్యంత పేదరికంలో ఉన్న వారిని ఆదుకోవడానికి మహిళా సంఘాలు ముందుండి పనిచేయాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆశయమని గుర్తు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీ నిధి 154 కోట్ల నికర ఆదాయం పొందడం అభినందనీయం అన్నారు. స్త్రీ నిధి వాటాదారులకు 14శాతం డివిడెంట్ డిక్లేర్ చేయడం స్త్రీ నిధి సంస్థకే గర్వకారణమన్నారు. ఇది మహిళా శక్తికి నిదర్శనమన్నారు. మహిళలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీలు చెల్లిస్తుందన్నారు. ఆడబిడ్డల చేతికి ఆదాయం కల్పించి వారు, వారి కుటుంబాలు సంతోషంగా ఉం డటానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకే ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రూ.57వేల కోట్ల బ్యాంకు రుణాలను అందజేశామన్నారు. రూ.400 కోట్ల విలువ చేసే శిల్పారామం స్థలంలో 106 మంది మహిళా సంఘాల సభ్యులు తమ చేతి వృత్తులను విక్రయించుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. శిల్పారామం అభివృద్ధికి రూ. 9 కోట్లు పంచాయతీరాజ్ శాఖ నుంచి కేటాయించి విక్రయదారులు, కొనుగోలు దారులకు అనుకూలమైన వాతావరణం కల్పిం చామన్నారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ కు చెందిన దివ్య దేవరాజన్, స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ జి విధ్యాసాగర్ రెడ్డి, స్త్రీ నిధి బ్యాంకు అధ్యక్షురాలు రజిత, ప్రధాన కార్యదర్శి శ్రీధేవి, కోశాధికారి ప్రవం తిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాగా పనిచేసిన వివిధ జిల్లాలకు చెందిన అధికారులను అవార్డులతో సన్మానించారు.







# శ్రీ రామాలయంలో శ్రీరాముల పట్టాభిషేకం, పుష్పాభిషేకం

### చైతన్య విల్లాస్ కాలనీ లో దాతలకు సన్మానం చేసిన కమిటీ ప్రతినిధులు

**రాజేంద్రనగర్, మార్చి 28(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి లో గల శ్రీ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. శనివారం ఆలయంలో శ్రీరాముల పట్టాభిషేకం, పుష్పాభిషేకం కార్యక్రమం ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కేర్ టేకర్ కమిటీ అధ్యక్షులు శాంతి లాల్ జ్యోశి ,శ్రీరామనవమి వేడుకల అడ్ హక్ కమిటీ అధ్యక్షులు హడాక్ కమిటీ ప్రతినిధులు పద్మశ్రీ, ఎం వనితా రెడ్డి, ఆదర్శ్ శుక్ల, స్వప్న,బెజవాడ రామలక్ష్మి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వేణుగోపాల్, రమణాచారి, దాతలు అరవింద్ కేడియా, జబ్బర్ సింగ్ పాల్గొన్నారు.














దాతలు వేణుగోపాల్ నాగలక్ష్మి, జబ్బర్ సింగ్, ధీరజ్ పవన్ సోనీ లకు సన్మానం చేస్తున్న ఆలయ శ్రీరామనవమి వేడుకల అడ్ హక్ కమిటీ ప్రతినిధులు పద్మశ్రీ, వనితా రెడ్డి, చిత్రంలో పూజల్లో పాల్గొన్న ఆలయ కేర్ టేకర్ కమిటీ అధ్యక్షులు శాంతి లాల్ జోషి, ప్రతినిధి ఆదర్శ శుక్లా, కాలనీవాసులు.

# మైలార్దేవుపల్లి పరిధిలో కల్తీ మిక్షర్, బిస్కట్లు, చిక్కీలు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు

### ముగ్గురు నిందితుల అరెస్ట్

**బుద్వేల్, మార్చి 28 (ప్రభాత ఉదయం):**

బాబుల్ రెడ్డి నగర్, లక్ష్మీగూడ ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో ప్రమాదకరమైన రసాయనాలను ఉపయోగించి కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో శనివారం మూడు కంపెనీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి దాడులు నిర్వహించారు. మున్నురు అరుణ్ కుమార్ అనే వ్యక్తి అరుణ్ కుమార్ ఫుడ్ కంపెనీ పేరుతో ఎటువంటి







కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్న కంపెనీలపై దాడులు చేసిన పోలీసులు, అధికారులు

అనుమతులు లేకుండ రసాయనాలను వాడుతు మిక్షర్ తయారు చేస్తున్నాడు. ఉండ్యాల మస్తాన్ రెడ్డి అనే వ్యక్తి అంజనీ ఫుడ్స్ పేరుతో లక్ష్మీగూడ లో ఉస్మానియా బిస్కట్లు, చిక్కీలు తయారు చేస్తున్నాడు. అపరిశుభ్రమైన వాతావరణంలో వీటిని తయారు చేస్తున్నాడు. బాబుల్ రెడ్డినగర్ లో విశాల్ జైన్ అనే వ్యక్తి జైన్ ఫుడ్స్ పేరుతో నమ్కిన్, మిక్షర్ తయారు చేస్తున్నాడు. హానికరమైన రంగులు ఉపయోగించి ప్రజల ఆరోగ్యాలకు హానికలిగించే విదంగా వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఇలా తయారు చేసిన కల్తీ అహార పదార్థాలను వివిధ దుకాణాలకు, హోటళ్లకు, నగరంలోని దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఈ కేసులో జల్పల్లి కి చెందిన మున్నూర్ అరుణ్ కుమార్(34), వెంకటేశ్వర కాలనీ కి చెందిన ఉ ండ్యాల మస్తాన్రెడ్డి (46). నగరంలోని సెహ్రూ నగర్ కు చెందిన విశాల్ జైన్ (41) లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.3,35,100ల విలువ చేసే వస్తువులను, సామాగ్రి ని స్వాధీనం చేసుకున్నారు.



ఉప్పర్ పల్లి లో శుక్రవారం రాత్రి జరిగిన సీతారాముల కల్యాణం లో పాల్గొన్న బీజేపీ నాయకులు బొక్క బాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు



# ఉప్పర్ పల్లిలో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**బుద్వేల్, మార్చి 28 (ప్రభాత ఉదయం):**

ఉప్పర్ పల్లి బస్తీలో శుక్రవారం రాత్రి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క బాల్ డ్డి కుటుంబ సభ్యులు సీతారాముల కళ్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, బస్తీ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# నార్మ్‌లో శిక్షణ కోసం వచ్చిన ఓ స్కిల్డ్ లేబర్ గుండెపోటుతో మృతి


**బుద్వేల్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

హైబ్రిడ్ మొక్క జొన్న లో శిక్షణ పొందడానికి డిల్లీ లోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) కు మార్చి 10వ తేదీన వచ్చిన ఓ స్కిల్డ్ లేబర్ శుక్రవారం తాను నిద్రించిన గది లోనే తుది శ్వాస విడిచారు. గుండెపోటుతో అతను మరణించినట్లు అనుమానిస్తున్నారు. వివరాలను ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీకి చెందిన అనిల్ కుమార్ (42) మార్చి 10వ తేదీన హైబ్రిడ్ మె ఎక్కజొన్న పై శిక్షణ పొందడానికి నార్మ్ వచ్చాడు. మరో రెండు రోజులలో ఆయన శిక్షణ పూర్తవుతుంది. శుక్రవారం మద్యాహ్నం భోజనం చేసిన అనిల్ కుమార్ హాస్టల్ లోని తన గది కి వెళ్లి పడుకున్నాడు. తిరిగి లేవలేదు. నిద్రలోనే మరణించాడు. ఆయనకు బీపీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన తో పాటు హాస్టల్ లో ఉంటున్న డిల్లీకి చెందిన స్తుతికిరణ్ అనిల్ కుమార్ సాయంత్రం ఎంతకు లేవక పోవడంతో గమనించి ఆయన గదికి వెళ్లి చూడగా మరణించి ఉన్నాడు. నార్త్ ఉన్నతాధికారుల కు సమాచారం ఇచ్చి వారి ద్వారా రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అనిల్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలిం చారు. కేసు దర్యాప్తు లో ఉంది.

# అనుమానస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య

**బుద్వేల్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని దట్టమైన చెట్లు ఉన్న ప్రాంతంలో ఓ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వారం రోజుల క్రితం జరిగి ఉ ంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అనుమానస్పదంగా ఉన్న ఈ ఆత్మహత్య వివరాలు ఎస్ఐ ప్రశాంత్రెడ్డి కథనం ప్రకారం ఈ విదంగా ఉన్నాయి.... 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండి ఒంటిపై మధర్ థెరిస్సా టెక్నో స్కూల్ - సత్తుపల్లి అనే పేరున్న టీ షర్ట్, షార్ట్ ధరించిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఉన్నాడు. చూసిన వారు ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా వారం రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నట్లు కనిపించింది. ముఖం గుర్తు పట్టరాకుండ కుళ్లిపోయింది. కాలు చేతుల చర్మం ఊడిపోయిం ది. మరణించిన వ్యక్తి కార్మికుడుగా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మరణించిన వ్యక్తి ఎవరై ఉంటారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఎందుకు ఈ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నాడు అనే కోణంలో విచారణ చేస్తున్నారు. కేసు ను రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



అనుమానస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి




# సహజ వర్ణాలతో వస్త్ర రంగులపై శిక్షణ" కార్యక్రమం

**రాజేంద్రనగర్, మార్చి 28 ()**

కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్లోని అపారెల్ అండ్ టెక్స్టైల్స్ విభాగం ఆధ్వర్యంలో "ఫ్రం ప్లాంట్ టు ప్యాటర్న్: సహజ వర్ణాలతో వస్త్ర రంగులపై ప్రాయోగిక శిక్షణ" శిక్షణ" అనే ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం టీజీకోస్ట్ ఎస్సీ, ఎస్టి సెల్ ప్రాజెక్ట్ కింద నిర్వహించబడగా, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ ఆర్థిక సహాయం అందించింది.ఈ శిక్షణ మార్చి 23 నుండి మార్చి 28 వరకు రాజేంద్రనగర్ లోని నేచురల్ డై ప్రాసెసింగ్ అండ్ ఇన్క్యుబేషన్ సెంటర్ లో జరిగింది. రంగారెడ్డి, మెదక్ , యాదాద్రి జిల్లాలకు చెందిన ఎస్సి , ఎస్టి వర్గాల నుండి 20 మంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సహజ వర్ణాలపై ప్రాథమిక , ప్రాయోగిక శిక్షణ అందించారు. పాల్గొనేవారు మొక్కల ఆధారిత వర్ణాలు, డై తయారీ విధానం, వస్త్రాల సిద్ధీకరణ, మోర్డాంటింగ్ మరియు రంగు వేయడం వంటి అంశాలు నేర్చుకున్నారు. టై అండ్ డై పద్ధతులు నమూనా తయారీలో కూడా ప్రాయోగిక శిక్షణ పొందారు.

# కృషి, పట్టుదలతో చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

**జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి**

**పటాన్ చెరు, మార్చి 28 (ప్రభాత ఉదయం):**

విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత విద్య ద్వారా కలలను సాకారం చేసుకోవచ్చని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అన్నారు. శనివారం బొల్లారం డివిజన్ పరిధిలోని సెయింట్ జాన్స్ పాఠశాల నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడి, వారిని ఉన్నత స్థాయికి చేర్చడానికి శ్రమిస్తారని, వారి కోసమే కాకుండా మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు ఇష్టంగా చదవాలని సూచించారు. పాఠశాల నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో మెలగడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందాలని,



ఉపాధ్యాయుల సూచనల ప్రకారం నడుచుకోవడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చని ఆయన చెప్పారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీనుల విందుగా అందరినీ అలరించాయి. కార్యక్రమంలో శ్రీ వాగ్దేవి పాఠశాలల



నిర్వాహకులు ఎ ఉదయ్ భాస్కర్ రెడ్డి, శ్రీ శ్లోక స్కూల్ నిర్వాహకులు కొత్వాల్ హరి కృష్ణారెడ్డి,వశిష్ట పాఠశాల నిర్వాహకులు లోకనాథం, గ్లోరియస్ పాఠశాల నిర్వాహకులు సింహాచలం, పలువురు పాఠశాలల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నరేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలియజేసిన వెంకటేశ్వర నగర్ డివిజన్ నాయకులు**

**కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు సందర్భంగా చెవిటి వాళ్లకు చెవుల మిషిన్, హ్యాండీ క్యాప్ వారికి హ్యాండ్ స్టిక్స్, కాళ్లు లేని వారికి వీల్ చైర్స్, అందజేయడం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పలు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాపి రెడ్డి నగర్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి, ప్రగతి నగర్ 1 అధ్యక్షులు మాచర్ల విష్ణు, వెంకటేశ్వర నగర్ అధ్యక్షులు డాన్ వెంకట్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుల శివకుమార్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేష్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పొన్నాల నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, నాగేందర్, పోశెట్టి, వంశీ, దీపక్, ఇమ్రాన్, రఫీక్, మహమూద్, పుష్ప, శివ గౌడ్, సుబ్బరాజు, గణేష్, రణధీర్ రెడ్డి, నరసింహ, విజయ్, కనకా రెడ్డి పలు బస్తీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కావేరి విశ్వవిద్యాలయం అధికారులు

## కావేరి యూనివర్సిటీకి ఉత్తమ ప్రైవేటు విశ్వవిద్యాలయం అవార్డు

**హైదరాబాద్, మార్చి 28(ప్రభాత ఉదయం)**

కావేరి విశ్వవిద్యాలయానికి ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు లభించింది. శనివారం నగరంలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన హెచ్ఎంటీవీ అవార్డు కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి లభించిన అవార్డును ఆ యూనివర్సిటీ అధికారులు అందుకున్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల పట్టాభిషేకం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

శ్రీరాములవారి కళ్యాణానంతరం శనివారం స్వామివారి పట్టాభిషేక కార్యక్రమశీ అత్యంత వైభవోపేతంగా జరిగింది. కూకట్ పల్లి రామాలయంలోనూ, దీప్తి శ్రీ నగర్ లోని ఆలయంలో శ్రీ రాములవారి పట్టాభిషేకాన్ని భక్తజన సందోహం మధ్య వేద పండితులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాభిషేక కార్యక్రమాన్ని తిలకించి, స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ శ్రీరామచంద్రుని ఆశీస్సులతో తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టిదినేష్ కుమార్, రంగమోహన్, వాసు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గొట్టిముక్కల దేశాలు జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి పురేందర్ రెడ్డి**

**కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

గొట్టుముక్కల దేశాలు జన్మదిన వేడుకలు వివేకానంద నగర్ డివిజన్ శేషాద్రి నగర్ లో గల ఆయన నివాసంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జన్మదిన వేడుకలకు రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి హాజరై ఆయనకు కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ అష్ట ఐశ్వర్యాలతో ఆరోగ్యంతో ఎల్లప్పుడూ 100 సంవత్సరాలు జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుచున్నానని అన్నారు. రాజకీయంగా ఉన్నత పదవులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని మనసు పూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, సూర్యనారాయణ, అఖిల్, శ్రీనివాస్, నరసింహారావు తదితరులు పాల్గొని దేశాలు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు

**జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,28(ప్రభాత ఉదయం)**

జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింతసమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరంనందు సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులనిర్వహకులతో జిల్లాలో గ్యాస్ పెట్రోల్, డీజిల్ సరఫరా, వినియోగంపై సమీక్షసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాకుఎటువంటి కొరత లేదని, తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్‌బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ వినియోగదారులు తరచుగాఅవసరం లేకుండా బుకింగ్‌లు చేయడం వల్ల సరఫరా వ్యవస్థపై అనవసర ఒత్తిడిఏర్పడుతుందని తెలిపారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత, సంబంధిత ఏజెన్సీలువినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయని తెలిపారు. ఎవ్వరూగ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు స్వయంగా వెళ్లి వేచి ఉండవద్దనిస్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల తేదీ వచ్చినప్పుడు గ్యాస్‌సిలిండర్‌ను తప్పనిసరిగా ఇంటి వద్దకే అందజేస్తామని హామీ ఇచ్చారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కొరత లేదని, ప్రజలు పెట్రోల్ బంకులవద్ద బారులు తీరి కొరత ఉన్నదని సమస్యలు సృష్టించకుండా, అధిక మోతాదులోతీసుకొని ఇండ్లలో నిల్వ చేసుకోవద్దని, దాని ద్వారా ప్రమాదాలు జరితేవకాశాలు ఉన్నందున ప్రజలు అవసరానికి మాత్రమే తీసుకోవాలని సూచించారు.పెట్రోల్ బంకుల నిర్వహకులు వాహనాలలో మాత్రమే పెట్రోల్, డీజిల్ వేయాలని,క్యాన్స్ లో, బాటిల్స్ లో వేయరాదని, ప్రజలకు అవగాహన కల్పించాలని,స్కూల్, ఆసుపత్రి వంటి ప్రాధాన్యత కలిగిన వాహనాలకు సరఫరాలో అంతరాయంకలుగకుండా చూడాలని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సరిపడా ఉన్నాయని,సరఫరాలో ఎలాంటి సమస్యలు లేవని ప్రజలకు గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకులనిర్వహకులు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ప్రజలకు మరోసారి తెలియజేయునది ఏమనగా, గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నందున ఎటువంటి ఆందోళన అవసరం లేదు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సరఫరా సక్రమంగా కొనసాగుతోంది. కాబట్టి ప్రజలు అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు రామేశ్వరి దేవి, కేషు రామ్, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పెట్రోల్ బంకుల నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ప్రభుత్వ శాఖల్లో ఈ ఆఫీస్ ద్వారా కార్యకలాపాల నిర్వహించాలి

**జిల్లా అదన కలెక్టర్ చంద్రారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 28( ప్రభాత ఉదయం)**

ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈ-ఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి పాల్గొన్నారు. జిల్లా అధికారులందరూ ఫైళ్లన్ని ఈ-ఆఫీస్ ద్వారా పంపే విధంగా చర్యలు చేపట్టడానికి ఎన్ ఐ సి ద్వారా జిల్లా అధికారులకు, శాఖల అధికారులకు సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ ద్వారా అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అధికారులందరూ ఏర్పరుచుకోవాలన్నారు. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉంటాయని అందువలన ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని, శాఖల వారిగా లాగిన్స్ పెండింగులో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల్లలో బల్క్ ఇమెయిల్ ఐడీలను క్రియేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు ఐడీలు క్రియేట్ కానీ ఎడల త్వరతగతిన ఏర్పాటు చేసుకోని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞాణంలో అధికారులందరూ ట్రైనింగ్ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, ట్రైనింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 27 (ప్రభాత ఉదయం)**



కేటిదొడ్డి మండల పరిధిలోని ఇర్కిచేడు శివారులో అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం నుండి ఇర్కిచేడు గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఇర్కిచేడు గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా, ఇసుక రవాణకు అనుతులు లేకపోవడంతో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. చంద్రబండకు చెందిన, చంద్రుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ప్రతి ఒక్కరిలో భక్తి భావం, మతసామరస్యాన్ని పెంపొందించడమే లక్ష్యం





**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయానికి 75 లక్షల భారీ విరాళం**

**నేటి వరకు సొంత నిధులతో 210 కు పైగా దేవాలయాల నిర్మాణం**

**పటాన్ చెరు, మార్చి 28 (ప్రభాత ఉదయం):**

ఒక వైపు అభివృద్ధిలో మరో వైపు ఆధ్యాత్మికతలో పటాన్చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుపుతూ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నిలుస్తున్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా గుడి, మసీదు, చర్చి నిర్మిస్తే తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొందించే విధంగా ఆయన పాటుపడుతున్నారు. తాజాగా పటాన్చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మీ సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి 75 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతాలు వేరైనా మనుషులందరూ ఒక్కటేనని.. మానవత్వం, ప్రేమ, శాంతి, మరియు సోదరభావం మతాల మూల సూత్రమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూ, పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 210 కి పైగా దేవాలయాలు, వందకు పైనా మసీదులు, ఆశిర్ఖానాలు, 30 కి పైగా చర్చిలు నిర్మించి పరమత సహనానికి ప్రతీకగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. దైవం పట్ల అచంచల విశ్వాసం, నిష్కామ కర్మ, క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంచుతాయని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలను మర్చిపోయి, మానవుడిగా ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్న మధు, ప్రభాకర్, సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీమార్గంలో కేసులకు త్వరితగతిన పరిష్కారం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 28(ప్రభాత ఉదయం)**

కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ దోహదపడుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి అన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం గద్వాల కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన ఈ ఏడాదికి సంబంధించిన మొదటి జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సామ్ కోషి, జస్టిస్ శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ సామ్ కోషి మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్ ద్వారా జోగులాంబ గద్వాల జిల్లాలో 5,345 కేసులు పరిష్కరించడం గర్వకారణమన్నారు. చిన్న చిన్న తగాదాలతో కోర్టుల వరకు వచ్చిన కక్షిదారులు తమ కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ గొప్ప వేదికగా పేర్కొన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సావధానంగా పరిష్కరించుకునేందుకు ఇరుపక్షాలు ముందుకు వస్తే కోర్టుల్లో కేసులు వేయాల్సిన అవసరం రాదన్నారు. ఒకసారి కోర్టులో కేసు వేశారంటే పరిష్కారం కావడానికి కొన్ని నెలలు, సంవత్సరాలు అవుతుందని, లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం రాజమార్గం అని పేర్కొన్నారు.న్యాయవాదులు తమ కక్షిదారుల కేసులను త్వరగా పరిష్కరిస్తేనే ఎక్కువమంది ఆ లాయర్ల దగ్గరకు వస్తారని, ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాకుంటే ప్రయోజనం లేదన్నారు. మనం ప్రస్తుతం 21వ శతాబ్దంలో ఉన్నామని, ఏ కక్షిదారుడు కూడా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాలని కోరుకునే పరిస్థితి ప్రస్తుతం ఉండకూడదన్నారు. కక్షిదారులు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే తమ కేసుల పరిష్కారానికి సంబంధిత న్యాయవాదులు సరైన దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ అదాలత్ ద్వారా పెద్ద ఎత్తున కేసులను పరిష్కరించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.జస్టిస్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కక్షిదారులు



చిన్న చిన్న తగాదాలతో కోర్టుల వరకు రావడంతో ఆయా న్యాయస్థానాల్లో పెద్ద ఎత్తున కేసులు పెండింగ్లో ఉంటున్నాయని, ఇరుపక్షాలు రాజీమార్గంలో తమ కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో తమ తమ ప్రాంతాల్లోని పెద్దమనుషుల సమక్షంలోనే చిన్న చిన్న తగాదాలను పరిష్కరించుకునేవారని, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కానీ సమస్యలను కోర్టులో వేయడం జరిగేదన్నారు. ప్రస్తుతం చాలా మంది చిన్నపాటి తగాదాలతోనే న్యాయస్థానాలను ఆశ్రయించడం వలన ఆయా కేసులను పరిష్కరించుకునేందుకు న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు. న్యాయవాదులు, లా విద్యార్థులు కూడా లీగల్ హెయిర్ సెంటర్స్, లోక్ అదాలత్ ల ద్వారా కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకునేందుకు సహకరించాలన్నారు. ఒకసారి ఇరుపక్షాలు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు ముందుకు వస్తే తిరిగి అప్పీల్ కు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల కక్షిదారులకు రాజీమార్గంలో సత్వరమే న్యాయం జరుగుతున్నందున న్యాయవాదులు పెద్ద ఎత్తున లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పంచాక్షరి మాట్లాడుతూ తెలిసో తెలియకో ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలో తప్పులు చేస్తుంటారని, ప్రశాంతంగా ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం దొరుకుతుంది కాబట్టి చిన్న పాటి తగాదాలకే ప్రజలు కోర్టుల దాకా రావలసిన అవసరం లేదన్నారు. కేసులు వేయడం వలన ఒక కోర్టులో తమకు న్యాయం జరగలేదనీ ఒక కక్షిదారుడు పై కోర్టుల దాకా వెళ్తుండడంతో సమయం, డబ్బులు వృథా అవుతాయన్నారు. ఇరుపక్షాలు రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ లు విజయవంతం కావడానికి అడ్వకేట్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు శాఖ వారి సహకారం కీలకమైనదిగా ఆయన పేర్కొన్నారు.జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ కోర్టుల పరిధిలో మొత్తం 7846 కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా పెద్ద ఎత్తున కేసులను రాజీమార్గంలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు కేసులకు సంబంధించి రాజీ అయిన పలువురు కక్షిదారులకు హైకోర్టు న్యాయమూర్తులు అవార్డు కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు యంత్రాంగం, బార్ అసోసియేషన్, పలువురు న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తులను, ఇతర అతిథులను శాలువా, పుష్ప గుచ్చాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులను ఎర్రవల్లి మండల కేంద్రంలోని పదవ పోలీస్ బెటాలియన్ వద్ద ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, బెటాలియన్ కమాండెంట్ జయరాజు, పలువురు జిల్లా న్యాయమూర్తులు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి లక్ష్మి, పోక్సో కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజిత, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ కుమార్, గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, వివిధ జిల్లా న్యాయస్థానాల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ వినోదాచారి, శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, భవాని, రేచల్, ఇతర న్యాయవాదులు, పోలీస్ శాఖ అధికారులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీలో యువత చేరికలు

**పార్టీ కండువా కప్పి**

**పార్టీలోకి ఆహ్వానించిన జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి**

**పటాన్ చెరు, మార్చి 28 (ప్రభాత ఉదయం):**

పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన బొల్లారం డివిజన్ పరిధిలో పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరి కండువాలు కప్పుకున్నారు. జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో నివసిస్తున్న పలువురు యువకులు బొల్లారం మాజీ ఎంపీటీసీ అరూరు రత్నం ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి తన చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా శివ, మున్నా, సర్వన, మని, రాజా, గోపి, మహేష్, వాసు, భరత్, వెంకటేష్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు టీ.సాయి కిరణ్ రెడ్డి, వి.శ్రీకాంత్ యాదవ్, బీరప్ప యాదవ్,పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.ద



చలో లేబర్ కమిషనర్ కార్యక్రమ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సుంకర రామ్మోహన్ రావు

## చలో లేబర్ కమిషనర్ కార్యాలయంను విజయవంతం చేయాలి

**బుద్వేల్, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న చేపట్టనున్న చలో లేబర్ కమిషనర్ కార్యక్రమాన్ని కార్మిక లోకం విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ నాయకులు సుంకర రామ్మోహన్రావు అన్నారు. చలో లేబర్ కమిషనర్ కార్యక్రమ వాల్ పోస్టర్ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులను బోర్డు ద్వారానే కార్మికులకు ఇవ్వాలన్నారు. పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ ను వెంటనే విడుదల చేయాలన్నారు.



బుద్వేల్ లేబర్ అడ్డా వద్ద..

**బుద్వేల్ లేబర్ అడ్డా వద్ద**


బుద్వేల్ లేబర్ అడ్డా వద్ద కార్మికులతో కలసి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె కవిత, బి స్వామిలు సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న చలో లేబర్ కమిషనర్ కార్యాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## 30న జరిగే ఉపాధి కూలీల ధర్నాను జయప్రదం చేయండి

**సిపి ఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ కూలీలకు పిలుపు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 28(ప్రభాత ఉదయం)**

విబిజి రాంజీ బిల్లును రద్దు చేయాలని, ఉపాధి కూలీలకు పెండింగ్ లో ఉన్న 2 నెలల కూలీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 న జరిగే ధర్నాకు ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సి పి ఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ కూలీలకు



పిలుపు ఇచ్చారు. శనివారం గద్వాల మండలంలోని శెట్టి అత్కుర్, సంఘాల గ్రామాలలోని ఉపాధి కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఉన్న చట్టబద్ధ పనిని రద్దు చేసి, కోరలు లేని వీబీజీ రామ్ జీ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ఉపాధి హామీ చట్టం ద్వారా కనీస ఉపాధి పొంది తమ జీవితాలను నిలబెట్టుకుంటున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం పేదల నోటి కాడి కుడు లాగేయడానికి ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి నిధులను తగ్గించిందని విమర్శించారు. రాష్ట్రాలపై భారం మోపి గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్నదని, పేదలకు అన్యాయం చేసే ఈ బిల్లు ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శెట్టి అత్కుర్ సంఘాల గ్రామాలలోని ఉపాధి కూలీలకు 2 నెలల కూలీలు పెండింగ్లో ఉన్నాయని, పని ప్రదేశాలలో సైతం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. కూలీలు గ్రామం నుండి రెండు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్తున్నప్పటికీ ఎటువంటి ప్రయాణ భత్యం చెల్లించడం లేదన్నారు. కూలీలకు నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోతే ఏ విధంగా పనిచేస్తారని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే ఉపాధి పనికి సరిపడ నిధుల కేటాయించకుండా పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కొంతమంది కూలీలకు ఫోటో క్యాప్చర్ రావడం లేదని ,దీనివల్ల కూలీలు పనిచేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం భూమిలేని కూలీలకు 12,000 ఇస్తామని చెప్పి, అమలు చేయడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30 తేదీన జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లాలోని ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, ఉపాధి కూలీలు సవారన్న, చిన్న హనుమంతు, రాజయ్య, సునీత, లక్ష్మి, జయమ్మ, మహేశ్వరి, యశోద, మహేష్, రాజేశ్వరి, రాము తదితరులు పాల్గొన్నారు.



రాజి పత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన అఋఋఎబతీష్పఋ

## కోర్టు కేసుల్లో.. రాజీ మార్గమే రాజ మార్గం

**న్యాయ సేవధికారి సంస్థ చైర్మన్,**

**జనగామ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ**

**ఈ జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 1508 కేసులు పరిష్కారం**

**165 సివిల్ కేసులు, 770 క్రిమినల్ కేసులు, 573 లిటిగేషన్ కేసులు పరిష్కరించబడ్డాయి**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

కోర్టు కేసుల్లో.. చాలా వరకు రాజీ మార్గమే రాజ మార్గమని న్యాయ సేవధికారి సంస్థ చైర్మన్, జనగామ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ , తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా న్యాయ సేవధికారి సంస్థ చైర్మన్, జనగామ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆధ్వర్యంలో జనగామ జిల్లాలోని అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించటం జరిగినది. ఈ సందర్భంగా జనగామ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు మరియు ఇతర కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ నాలుగు బెంచులను వేయడం జరిగినదని, మొదటి బెంచ్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, బెంచ్ మెంబరుగా న్యాయవాది కె.సునీత రాణి, రెండవ బెంచ్లో సీనియర్ సివిల్ జడ్జి ఈ.సుచరిత, బెంచ్ మెంబరుగా బి.స్వప్న, మూడవ బెంచ్లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి జి.శశి, బెంచ్ మెంబరుగా న్యాయవాది కె.పుష్ప, నాలుగవ బెంచ్లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ కుమారి కె.సందీప్, బెంచ్ మెంబరుగా న్యాయవాది కుమారి ఇట్టబోయిన జోష్ణ పాల్గొన్నారని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్లో ఒక కోటి 7 లక్షల 55వేల రూపాయల విలువైన 165 సివిల్ కేసులు పరిష్కరించబడ్డాయని, 38లక్షల 43వేల 150 రూపాయల విలువైన 770 క్రిమినల్ కేసులు పరిష్క రించబడ్డాయని, 44లక్షల 87వేల 498 రూపాయల విలువ గల ప్రీ లిటిగేషన్ కేసులు 573 పరిష్కరించబడ్డాయని, 1 కోటి 90లక్షల 85వేల 648 రూపాయల విలువ గల మొత్తం 1508 కేసులు పరిష్కరించి అందుకు గాను ఈ జాతీయ లోక్ అదాలత్లో కక్ష దారులకు రాజీ పత్రాలను అందించడం జరిగినదని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జనగామ బార్ నాయకులు, సభ్యులు, న్యాయవాదులు, కాక్షిదారులు, పారాలీగల్ వాలంటీర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు రాజారావు మృతి

**రాజేంద్రనగర్,మార్చి28(ప్రభాత ఉదయం)**



ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించిన ప్రముఖ ఉపాధ్యాయులు రాజారావు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు.హైదర్గూడలోని న్యూ బ్రిలియంట్ హైస్కూల్లో గత అనేక సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాధించుకున్నాడు.ఆయన హఠత్మరణంతో స్థానిక ప్రజలు దిర్భాంతి వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న ఆనాటి విద్యార్థులు,స్థానిక ప్రజాప్రతినిధులు,నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఆయన చేసిన కృషి ఎంతో ఉందని కొనియాడారు.ఆయన సేవలను ఎన్నటికి మరచిపోలేనివని వ్యక్తం చేశారు.




## అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ఆశా వర్కర్ల ఆగ్రహం

**హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక**

**కూకట్ పల్లి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ మండలంలో ఆశా వర్కర్లపై జరిగిన అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనిత, రేవతి తెలిపారు. ప్రజల ఆరోగ్య సేవలకు అంకితభావంతో పనిచేస్తున్న ఆశా వర్కర్లను ఈ విధంగా నిర్బంధించడం అన్యాయమని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆమె మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశా వర్కర్లు చాలా కాలంగా తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్నారని, కానీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే అక్రమంగా అరెస్టు చేసిన ఆశా వర్కర్లను విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడం, పనికి తగిన గుర్తింపు ఇవ్వడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోకుండా అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని, గ్రామీణ ప్రాంతాల్లో వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొంటూ, అలాంటి వారిని అణచివేయడం కంటే వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. ఈ సంఘటనపై ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు స్పందించి ఆశా వర్కర్లకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.



## భక్తులతో కిక్కిరిసి పోయిన పెద్ద చింతరేవుల ఆంజన్న ఆలయం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 28 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలంలోని శ్రీపెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రాంగణం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి ఆంజనేయస్వామికి దాసంగాలు సమర్పించారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608